

# తృప్తి

పాలకూర సీతాలత

విక్రమరావు గుండె స్పందించిపోయింది.

కళ్ళు చెమర్చాయి. శరీరంలోని ఓపిక నంతా ఎవరో కొల్లగొట్టినట్లు ఎక్కడ లేని నీరసం ఆవహించింది. బాధగా కళ్లు మూసుకుని కుర్చీలో వెనక్కు జార్లపడ్డాడు. అతని పెదవులు అస్పష్టంగా 'అమ్మ .... అమ్మ...' అని గొణిగాయి.

"సార్...అయ్యగారు పిలుస్తున్నారు!" అన్న ప్యూను మాటలు విని కళ్లు తెరిచాడు విక్రమరావు.

"అలాగే-వస్తున్నాను!" అన్నాడు విక్రమరావు అతికష్టంమీద దుఃఖంతో పూడుకుపోయిన తన గొంతు విప్పి.

జేబులోంచి ఉత్తరం తీసి మళ్ళీ చదువుకున్నాడు. తండ్రి రాసిన ఉత్తరం అది

"నువ్వు వెంటనే బయలుదేరిరా. అమ్మకు పక్షవాతం వచ్చి చెయ్యి పడిపోయింది. పలుకరిస్తే చాలు. బావురుమంటోంది. నిన్ను చూడాలని కోరుతోంది..."

ఆ ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని తడబడుతున్న అడుగులతో ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు. ఆయన ఏదో ఫైలు ఇచ్చి ఆ పని అర్జంటుగా చెయ్యమన్నాడు.

"ఈ పని చేస్తాను సార్, సాయంత్రం బస్సులో ఊరికి వెళ్ళాలి. నాలుగు రోజులు శలవు కావాలి" అన్నాడు.

"శలవా? నో! కుదరదు మీ సెక్షన్ ఆఫీసరు కూడా ఊళ్ళోలేడు. మిగతా గుమాస్తాలకంటే సీనియర్‌వి నువ్వు నాలుగు రోజులతర్వాత ఇనస్పెక్షన్ ఉంది. రోజూ మరో రెండు గంటలు సాయంత్రంపూట ఎక్కువగా పని

చెయ్యాలని చెప్పాలనే పిలిచాను. ఇలాంటి పరిస్థితుల్లో శలవు ఎలాగా? వీల్లేదు" అన్నాడు ఆయన.

"సార్! అమ్మకు బాగోలేదు సార్. ఉత్తరం వచ్చింది అందుకే వెళ్ళడం తప్పనిసరి. ప్లీజ్. అవసరంపడితే తప్ప శలవు తీసుకునే రకంకాదు నేను. ఆ విషయం మీకు తెలుసు-" అన్నాడు విక్రమరావు నమ్రతగా.

ఆ ఆఫీసరు తత్వం అంతే. బ్రతిమాలితే గుర్రం ఎక్కుతాడు. గట్టిగా అరిస్తే పిల్లిలా తోక ముడుస్తాడు. కానీ సహజంగా విక్రమరావుది మెత్తని స్వభావం. ఎవ్వరితోనూ గొడవపడే రకం కాదు.

"చూడు మిస్టర్...అమ్మ, బొమ్మ అంటూ నన్ను విసిగించకు. నా టైము వేస్టు చెయ్యకు. నీ టైము వేస్టు చేసుకోకు. సాయంత్రం మరో రెండు గంటలు ఎక్కువ పనిచెయ్యి. వెళ్ళు-" అన్నాడు ఆయన.

విక్రమరావు ఫైలు పట్టుకుని విచారంగా వచ్చేడు సీట్లోకి. ఫైలు తెరిచాడు. అతనికి ఎంత మాత్రం పనిచెయ్యబుద్ధి కావటంలేదు. అతనికి కళ్ళు తెరిచినా, మూసినా తల్లి రూపమే కనపడుతోంది. అతికష్టంమీద పని పూర్తి చేశాడు. అ ఫైలు తీసుకుని ఆఫీసరుకి ఇచ్చేశాడు. ఆయన ముఖం ఇంత చేసుకుని "గుడ్" అన్నాడు.

మరొక్కసారి శలవు గురించి మనవి చేశాడు. ఈ సెక్షనాఫీసరు శలవులో వుండటం తన ప్రాణంమీదకు వచ్చింది. లేకపోతే ఆయన చేతనే శలవు శాంక్షన్ చేయించుకుని వెళ్ళిపోయి వుండేవాడు.

"విసుగుచెందని విక్రమార్కుడిలా ఎన్నిసార్లు అడుగుతావు? ఆఫీసుపని ఒక గొప్ప యజ్ఞంలా భావించాలి. రక్త సంబంధాలు మరచిపోవాలి. నీకు శలవు ఇయ్యడం కుదరదు. నన్ను అర్థం చేసుకో. ఈ ఇనస్పెక్షన్ ఒకటి ఏడవక పోతే తప్పకుండా శలవు ఇచ్చి వుందును" అన్నాడు ఆయన

అయినా విసుగు చెందకుండా నిజంగా విక్రమార్కుడిలాగే ప్రవర్తించేడు. మరో పదినిముషాలు అయినా కూడా లాభం లేకపోయింది గొడ్డుటావుని పితక డానికి పోతే పాలు ఇయ్యదు సరికదా పళ్లు ఊడేలా తంతుంది. అదే గుర్తు వచ్చి సీట్లోకి వచ్చేశాడు. ఆఫీసరుగారు చెప్పినట్లు మరొక రెండు గంటలు ఎక్కువ పనిచేసి రూముకు వచ్చాడు విక్రమరావు.

అతని మనసంతా చికాగ్గా వుంది. తల్లి గుర్తుకు వస్తోంది. లేచి కాఫీ చేసుకుని తాగాలని అనుకుని కూడా మంచం మీద అలాగే వాలిపోయాడు. అన్నం తినాలని కూడా అన్పించలేదు. అందుకే వంట చేసుకోనక్కరలేదు కాళ్ళను కడుపులోకి ముడుచుకుని ఆలోనల్లో మునిగిపోయాడు.

అమ్మకు పక్షవాతం వచ్చి చెయ్యి పడిపోయింది. ఇక బొమ్మలు ఎవరు చేస్తారు? అమ్మ చేతిలో వున్న ఆ కళ-ఆ వేళ్ళకు వున్న నైపుణ్యం-ఆమెతో అంతరించిపోవలసిందేనా? మట్టితో అందంగా-ఎంతో అందంగా బొమ్మల్ని చెయ్యగల కళ అమ్మకు ఎప్పుడు అబ్బిందో తెలియదుగానీ తన చిన్నప్పటి నుంచీ చూస్తూనే వున్నాడు-బొమ్మ చెయ్యడం ఒక ఎత్తు-దానికి తగ్గట్లు రంగులు వెయ్యడం ఇంకొక ఎత్తు. ఆమెచేసిన బొమ్మ..అది వినాయకుడిది అయినా దుర్గాదేవిది అయినా లక్ష్మీదేవిది అయినా...సహజకళ ఉట్టిపడవలసిందే. బంకమట్టి నుంచి ఆ బొమ్మలు రూపుదిద్దుకోవడానికి కారణం అమ్మ చేతికి వున్న మహాత్మ్యం. ఆమె బొమ్మలు చేస్తుంటే చూడాలి... ఆ వేళ్ళ కదలిక చాలా తమాషాగా వుంటుంది. చూస్తుండగానే క్షణాల్లో మట్టి ముద్ద ఒక మూర్తిగా రూపుదిద్దుకుంటుంది. చిన్నప్పుడు ఎంతో ఆసక్తిగా తను అమ్మచెంతనే వుండి ఆ బొమ్మలు చేస్తున్న ఆమెనిగమనిస్తూ వుండేవాడిని.

"ఎలా వుందిరా కన్నా?" అని అడిగేది అమ్మ.

"చాలా బాగుందమ్మా!" అనేవాడు తను. అప్పుడు తన చెంపలమీద ముద్దు పెట్టుకునేది!

ఒక్కొక్కసారి తనను అడిగేది.

"నువ్వుకూడా బొమ్మలు చెయ్యడం నేర్చుకుంటావా? నేర్పుతాను —"

"ఓ...అలాగే!" అనేవాడు తను సంతోషపడిపోతూ. అమ్మ నేర్పిన తర్వాత తనుకూడా అంత చక్కగా బొమ్మలు చెయ్యగలడన్న ఆలోచనే ఆ రోజుల్లో తనకు తృప్తి ఇచ్చేది.

"ఎందుకే...మనవి ఎలాగూ మట్టి బతుకులే! వాడు కూడా మనలాగే మట్టి పిసుక్కుంటూ గడపాలా ఏం?" అనేవాడు తండ్రి.

తన తండ్రి కుమ్మరి. కుండలుచేసి అమ్ముకుంటాడు. తండ్రి తెచ్చే ఆ మట్టితోటే అమ్మ బొమ్మలు చేసేది.

"బొమ్మలు చెయ్యడం తప్పుకాదే!" అనేది అమ్మ.

"వాడు చదువుకుని...మంచి ఉద్యోగం చేస్తాడులే" అనేవాడు నాన్న.

"చదువుకోమనండి-తప్పులేదు. ఈ కళ కూడా చేతిలో వుంటే లాభమేకానీ నష్టం లేదుకదా..." అంటూ అమ్మ నచ్చచెప్పడానికి ప్రయత్నించేది.

ఆ మాటలన్నీ ఈ రోజు కూడా తనకు బాగా గుర్తు.

"లేదు నాన్నా...నేను బొమ్మలు చెయ్యడం నేర్చుకుంటాను!" అన్నాడు తను.

"మరి చదువుకోవా?" నాన్న ప్రశ్న.

ఒక క్షణం ఆలోచించాడు తను.

"రెండూ చేస్తాను?" అన్నాడుతను.

"నీకు నేను బొమ్మలు చెయ్యడం నేర్పుతానులే—కొంచెం పెద్దయ్యాక" అంది తల్లి.

సరే అంటూ తల ఊపాడు తను.

స్కూల్లో చదువుకుంటూనే అమ్మ బొమ్మలు చేస్తుంటే పుస్తకంమూసి వచ్చేసేవాడు తను.

ఆ బొమ్మలకు కూడా సీజను.

వినాయకచవితి రోజుల్లో వినాయకుడి బొమ్మలు ఎన్నో చేసేది. అవన్నీ అమ్ముడు అయిపోయేవి. అలాగే దసరా సమయంలో దుర్గ బొమ్మ. ఇవే కాక మామూలు రోజుల్లో పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు, ఎరుకలసాని, పోలీసు, తల్లి దండ్రుల్ని కావిట్లో మోసుకు పోతున్న శ్రావణకుమారుడు. గాంధీ తాత...ఇలా ఎన్నో రకాల బొమ్మలు చేస్తుంది.

ఏ బొమ్మ చేసినా అందులో సహజ కళ.

అప్పట్లో తనకు పదిహేను సంవత్సరాలు.

"బొమ్మలు చెయ్యడం నేర్పుతాను" అంది అమ్మ.

'సరే' అంటూ ఉత్సాహంగా బొమ్మలు చెయ్యడం నేర్చుకున్నాడు తను. బొమ్మలు చెయ్యడం చూస్తున్నంత తేలిక కాదని అర్థంచేసుకున్నాడు. అందుకు చాలా కష్టపడవల్సి వచ్చింది తను. మొత్తానికి ఏదో రకంగా ఒక రూపు తీసుకురాగలిగాడు.

కానీ ఆ బొమ్మలు ఏ మాత్రం బాగుండేవి కావు.

"చాలా బాగున్నాయి కన్నా..." అనేది అమ్మ.

ఆమె కేవలం తనను ప్రోత్సహించడానికే ఆ మాటలు అంటోందని తనకు తెలుసు.

"లేదమ్మా! నీ బొమ్మలు...నా బొమ్మల కంటే చాలా బాగున్నాయి." అన్నాడు తను.

"ఇవి కూడా బాగానే వున్నాయి. ఇంకా చేస్తే మరింత బాగా వస్తాయి!" అంది అమ్మ.

తనలో కూడా పట్టుదల పెరిగింది. అమ్మ ఎంత బాగా చేస్తోందో తను కూడా అంత బాగా చెయ్యాలి. అదే దీక్షతో తను బొమ్మలు చెయ్యసాగేడు.

కొంతవరకూ బాగానే చెయ్యగలిగాడు...కొంత తృప్తి కలిగింది.

తను అలాగే మరికొన్ని రోజులు బొమ్మలు చేస్తే తప్పకుండా అమ్మ చేస్తున్న బొమ్మల స్థాయికి చేరుకునేవాడు.

కానీ తన స్నేహితుల హేళన...ఆ తర్వాత తనను మట్టి ముట్టుకోకుండా చేశాయి.

ఆ రోజు తనకు బాగా గుర్తు.

బొమ్మలు చేస్తూ కూర్చున్నాడు. అందువల్ల తన చేతులన్నీ బంక

మన్నుతో అసహ్యంగా వున్నాయి. స్కూలు వార్షికోత్సవ సందర్భంగా తను రాసిన వ్యాసానికి మొదటి బహుమతి వచ్చింది. అందుకోసం అభినందించాలని తన మిత్రులందరూ ఒకేసారి కట్టకట్టుకుని ఇంటికి వచ్చారు. మిత్రులు రావడం, తనని మెచ్చుకోవడం చాలా సంతోషం కలిగింది. ఒక మిత్రుడు షేక్‌హాండ్ ఇయ్యడానికి ముందుకు చాపాడు. తన చెయ్యి బంకమన్నుదని తను కూడా మరిచిపోయాడు ఆ సంతోషంలో. అందుకే తనూ చెయ్యిముందుకు పోనిచ్చి మిత్రుడి చేతిలో వేశాడు.

"ఛీ...ఛీ..." అంటూ ఆ మిత్రుడు చెయ్యిని వెనక్కి లాక్కున్నాడు.

"ఏ మిత్రా ఇది. డర్టీగా ..." అన్నాడు ఒకడు.

"మట్టి పిసుక్కునే ఖర్మ నీకేంరా? తెలివైన విద్యార్థివి...."

"నీ బట్టలమీదకూడా మట్టి పడిందిరా! ఛీ..."

"ఏమిత్రా ఈ వెధవ అవతారం?"

"నీ టైమంతా ఇలా మట్టితో గడిపితే...చదువు ఎప్పుడు చదువుతావురా?"

ఇలా ఒక్కొక్కడు ఒక్కొక్క రకంగా కామెంట్ చేశారు. ఆ మాటలన్నీ తన పాలిట వాడి బాణాల్లా తగిలాయి. మిత్రులందరి ముందూ తనకు అవమానం జరిగినట్లు బాధపడిపోయాడు.

"సారీ రా...నీ చేతికి నున్ను అంటింది–" అన్నాడు తను చెయ్యి కలిపిన మిత్రుడితో.

"ఫర్వాలేదులే. కడుక్కుంటే ఇది పోతుంది...నువ్వు కూడా ఈ మట్టితో ఆడుకునే ఆలోచన కడిగేసుకో. పైకి రావలసినవాడివి. నీ టైము వృథా చేసుకోకు..." అన్నాడు వాడు.

ఆ తర్వాత మిత్రులందరూ వెళ్ళిపోయారు.

తను మాత్రం చేతులు కడుక్కోకుండా అలాగే కూర్చుని ఆలోచిస్తూ వుండిపోయాడు.

నిజమే...శ్రద్ధగా చదువుకోక–ఈ మట్టితో బొమ్మలు చేసుకోవడం ఏమిటి? తను రేపు పెద్ద ఆఫీసరై సంపాదించబోయే డబ్బు–ఈ బొమ్మలు అమ్ముకున్నందువల్ల వచ్చే డబ్బులో ఎన్నోవంతు?

పైగా మిత్రుల ముందు తలవంపులు. ఎందుకొచ్చిన తాపత్రయం తనకు?

రేపట్నుంచి...కాదు కాదు...మరుక్షణం నుంచీ తను ఈ బొమ్మలజోలికి పోకూడదు. గట్టిగా నిర్ణయం చేసుకున్నాడు.

"కన్నా...బొమ్మ చెయ్యడం అయ్యిందా?" అంటూ అమ్మ లోపల్నుంచి వచ్చింది. ఆమె ఇంతసేపూ లోపలే వుంది. తన మిత్రులు వచ్చి వెళ్ళిన విషయం ఆమెకు తెలియదు.



"లేదమ్మా!" అన్నాడు తను మట్టి చేతులు రెండూ ఒకదానితో ఒకటి రాపాడిస్తూ చేతుల మధ్యనుంచి మట్టి రాలి పడింది.

"ఎందుకని? ఆ బొమ్మ చెయ్యడానికి ఇంత సేపు పట్టకూడదు." అంది అమ్మ.

"లేదమ్మా...ఇక నేను బొమ్మలు చెయ్యను!"అన్నాడు తను నిశ్చయంగా.

తల్లి ఆశ్చర్యపోయింది.

"ఎందుకని?" అంది.

స్నేహితుల ఎగతాళి గుర్తుకు వచ్చింది. ఆ విషయాలు తల్లికి చెప్పటం ఇష్టంలేదు. అందుకే "అదంతే!" అన్నాడు తను.

ఆ సమయంలో మరేం ప్రశ్నించలేదు. తర్వాత నచ్చచెప్పవచ్చని అనుకుందేమో తనకు తెలియదు ఆ మర్నాటి నుంచి నిజంగానే మట్టి ముట్టుకోలేదు. అందుకు నోరు విప్పి చెప్పకపోయినా తల్లి బాధపడిందన్న విషయం తనకు తెలుసు. తను పుస్తకాలు ముందువేసుకుని చదువుకుంటూ కూర్చునేవాడు.

"ఏం కన్నా...ఈ వేళ చదువుకోవల్సింది చాలా వుందా?" అంది తల్లి.

నిజానికి చదువుకోవల్సినది అంత ఎక్కువ లేదు. నిజం చెప్తే బొమ్మలు చెయ్యడంలో కొంత సమయం గడపమంటుందేమో అని భయపడ్డాడు తను. అందుకే అబద్ధం చెప్పాడు.

"అవునమ్మా...చాలా చదువుకోవాలి!" అన్నాడు.

తల్లి మరేం మాట్లాడకుండా అక్కడ నుంచి వెళ్ళిపోయేడు.

ఇక ముందు ఎన్నడూ బొమ్మలు చెయ్యకూడదని నిర్ణయించుకున్నాడు. అంతేకాదు. తల్లి బొమ్మలు చేస్తున్న సమయంలో కూడా అక్కడికి వెళ్ళడం మానేశాడు.

తనలో వచ్చిన మార్పు తల్లి తప్ప కుండా గ్రహించి వుంటుందనిపించింది. అయినా అమె ఏం అనలేదు.

ఇలోగే ఒక నెల రోజులు గడిచి పోయాయి.

"ఈ మధ్య నువ్వు మళ్ళీ బొమ్మలు చెయ్యటంలేదు" అంది తల్లి ఒకరోజు.

ఏం జవాబు చెప్పాలా అని ఒక నిమిషం ఆలోచించాడు. చదువు మిష ఒక్కటే తప్పించుకుందుకు మార్గం అని తోచింది.

"ఈ మధ్య చదువులో చాలా టైము గడిచిపోతుందమ్మా-పరీక్షలు కూడా వస్తున్నాయి!" అన్నాడు.

"సరే కన్నా-చదువుకో ముందు చదువు. ఆ తర్వాతే ఏమైనా-" అంది తల్లి.

ఆరునెలలు గడిచిపోయాయి. ఒక్క రోజు కూడా తను మట్టి ముట్టుకోలేదు.

ఏ ముహూర్తంలో తన మిత్రులు తను బొమ్మలు చెయ్యడం గురించి కామెంట్ చేశారో తెలియదుగానీ అది తనమీద గాఢమైన ప్రభావమే చూపింది. పైగా తనకు తండ్రి సపోర్టు ఒకటి దొరికింది.

సంవత్సరాలు గడిచిపోయాయి.

తండ్రికి అనారోగ్యం కలగడంతో తల్లే ఒక పక్క కుండలు చేస్తూ, మరొక పక్క బొమ్మలు చేస్తూ ఇల్లు నడిపింది. కుండలు అమ్మిన సొమ్ము కంటే బొమ్మల ద్వారా వచ్చిన సంపాదనే అధికంగా వుండేది. ఆ డబ్బుతోనే తను డిగ్రీ చదువు పూర్తిచేశాడు.

డిగ్రీ పూర్తిచేశాక ఉద్యోగాల వేటలో పడ్డాడు. కాలేజీలో చదువుతుండగా తను ఊహించుకున్నవన్నీ కలలుగానే మిగిలిపోయాటు అంత వరకూ కళ్లు మూసుకున్న తనకు కళ్లు తెరుచుకున్నట్లు అయ్యింది. చదువు పూర్తికాగానే చెయ్యడానికి ఉద్యోగాలు అంత తయారుగా లేవు. పైగా తను చదివిన చదువుకి ఆఫీసరు ఉద్యోగం రాదు. ప్రకటనలు చూసి అప్లికేషన్లు పెడుతూ, ఇంటర్వ్యూలకు వెళ్తూ కాలం గడిపాడు.

"కన్నా-ఇప్పుడు ఖాళీగానే వున్నావు కదా...బొమ్మలు చెయ్యడంలో నాకు సాయం చెయ్యకూడదూ?" అంది తల్లి.

"ఏమిటీ నీ ఉద్దేశ్యం? వాడు మంచి ఉద్యోగం చేస్తాడు. బొమ్మలు చేసే ఖర్మ ఎందుకు వాడికి?" అన్నాడు తండ్రి.

తల్లి మాటలకంటే తనను తండ్రి మాటలే ప్రభావితం చేశాయి. అందుకే తను తండ్రి పక్షాన చేరిపోయాడు. బొమ్మలు చెయ్యడం కోసం మట్టిని ముట్టుకోలేదు.

ఒక ఏడాది తర్వాత తనకు గుమాస్తాగా ఉద్యోగం వచ్చింది.

తండ్రి చాలా సంతోషించాడు, తల్లి మాత్రం పెద్ద సంతోషించినట్లు కనపడలేదు.

"కన్నా-ఎందుకురా ఈ ఉద్యోగాలు. బొమ్మలు చెయ్యడంలో ఇంతకంటే సంపాదించుకోవచ్చు. హాయిగా ఇంటి పట్టున మా కళ్ళముందే వుండొచ్చు ఉన్న ఒక్కడివీ ఉద్యోగం పేరున మాకు దూరం కావడం ఎందుకు?" అంది తల్లి.

ఆ మాటలు తనకు రుచించలేదు.

"వద్దమ్మా-ఈ ఉద్యోగం మంచిది" అన్నాడు తను.

తల్లి ఇంకేం మాట్లాడలేదు. వెంటనే తను ఉద్యోగంలో చేరిపోయాడు.

ఒక రూము తీసుకుని, ఒక్కడే వుంటూ...వండుకుంటూ... ఉద్యోగం చేసుకుంటున్నాడు. మూడేళ్లు గడిచాయి. ఇప్పుడు ఈ పెళ్ళిగాం...

తను అందరికీ దూరంగా ఒంటరిగా ఉంటూ...ఈ ఉద్యోగం చేసుకుంటూ బావుకున్నది ఏమిటి?

చాలీచాలని జీతం-ఏదో చెప్పలేని వెలితి...ఆ వెలితి ఈ మూడు సంవత్సరాలుగా తనను పట్టి పీడిస్తూనే వుంది. అందుకు కారణం ఏమిటో ఎంత ఆలోచించినా బోధపడదు.

తల్లి అనారోగ్యానికి తీవ్రంగా మధన పడుతూన్నా, ఆమెను చూడడానికి కూడా వెళ్ళకుండా చేస్తోంది ఈ వెధవ ఉద్యోగం.

రక్త సంబంధాలకూ, అనుబంధాలకూ విలువ ఇయ్యని ఈ పాడు ఉద్యోగం ఎందుకు? అమ్మకు చెయ్యి పడిపోయింది. బొమ్మల తయారీ ఆగిపోయింది. తమ కుటుంబానికి దైవదత్తంగా వచ్చిన ఈ కళ ఆమెతోటే అంతరించిపోవాలా? దాన్ని ఆమె తర్వాత తను ఎందుకు చేపట్టకూడదు?

ఆ ఆలోచనకే ఉలిక్కిపడ్డాడు విక్రమరావు.

ఏమిటి? తనేనా ఈ రకంగా ఆలోచిస్తున్నది? మిత్రుల అవహేళన కారణంగా మట్టికి దూరమైన తనేనా ఈ విధంగా అనుకుంటున్నది?

అవును...ఈ నిర్ణయమే బాగుంది. నిజానికి ఆనాటి మిత్రుల మాటలు తనను పెడతోవ పట్టించాయి. బహుశా అందుకే ఈ రోజు కూడా ఏదో చెప్పలేని వెలితి తన మనసులో చోటు చేసుకుంది.

తల్లిని చూడడానికి పరిస్థితులు అనుకూలంగా చెయ్యని ఈ ఉద్యోగం మానేసి తల్లి చెంతనే కాలం గడుపుతూ

...ఆమె సహచర్యంలోని మాధుర్యాన్ని స్వంతం చేసుకుంటూ.. ఆమె దగ్గర మరిన్ని మెళుకువలు నేర్చుకుని బొమ్మలు చేసుకుంటూ బ్రతుకు గడపడం మంచిది.

ఈ ఉద్యోగంలో తనకు వస్తున్న జీతం మాత్రం ఎంత?

అలాగే చెయ్యాలి. ఉద్యోగంకి రాజీనామా ఇచ్చి వెంటనే బయలుదేరి వెళ్ళిపోవాలి. తల్లి ఒడిలో వాలిపోవాలి. ఆమెకు ఇన్నాళ్ళూ తను కల్గించిన మనస్తాపానికి మనస్ఫూర్తిగా క్షమార్పణ చెప్పుకోవాలి. ఆ తర్వాత ఆమె కళ్ళల్లో కన్పించే 'తృప్తి' చాలు తనకు.

ప్రపంచంలోని సంపద అంతా ఒక చోట పోగుచేసి తనకు ఇచ్చినా అది ఆ అమ్మ కళ్ళల్లోని తృప్తికి సాటిరాదు.

ఈ ఆలోచన రాగానే చటుక్కున లేచి కూర్చున్నాడు విక్రమరావు. టైము చూసుకున్నాడు. ఎనిమిది గంటలయింది, రాత్రి పదిగంటలకు తమ ఊరికి ఒక బస్సు ఉందన్న విషయం గుర్తు వచ్చింది. ఆ బస్సులో బయలుదేరి వెళ్ళిపోతే?

వెంటనే మంచం దిగాడు. సబ్బుతో ముఖం కడుక్కున్నాడు. తల దువ్వుకున్నాడు. సూట్ కేసులో గబగబా నాలుగుజతల బట్టలు సర్దుకుని రూముకు తాళం వేశాడు.

అంతవరకూ ఎక్కడ దాగివుందో తెలియదుగానీ అప్పుడే గట్టిగా ఆకలి వేసింది. నిరాశా నిస్పృహాలు ఆకల్ని చంపివేస్తాయి. అందుకే ఇంతవరకూ ఆకలి అన్పించలేదు.

తన ఈ నిర్ణయం ఒక కొత్త ఉత్సాహాన్ని కలిగించింది. పైగా తల్లిని చూడబోతున్న సంతోషం దానికి తోడైంది. అందుకే కాబోలు... ఆకలి వేసింది.

రోడ్డు చివర హోటల్లో వచ్చిపడ్డాడు. రాత్రంతా బస్ ప్రయాణం కనుక భోజనం చెయ్యకుండా లైట్‌గా వుంటుందని దోశ తిన్నాడు కాఫీ తాగాడు. బస్ స్టాండ్‌కి దగ్గర్లోనే వుండే అతని కొల్లీగ్ గుర్తుకొచ్చాడు. అతన్నొకసారి కలిసి వెళ్ళడం మంచిదనిపించింది. ఉద్యోగానికి రాజీనామా ఇయ్యాలన్న ఆలోచన వున్నా ఇలా చెప్పకుండా, చెయ్యకుండా వెళ్ళిపోవడం మనిషిగా తను చెయ్యవల్సిన పనికాదు.

అందుకే అక్కడ నుంచి తిన్నగా మిత్రుడి ఇంటికి వెళ్ళాడు.

"రా రా! ఏమిటి ఈ టైములో వచ్చావు?" అన్నాడు మిత్రుడు!

విషయమంతా వివరంగా చెప్పాడు. తన నిర్ణయంకూడా చెప్పాడు.

"ఒక కాగితం, పెన్ను ఇయ్య..." అన్నాడు విక్రమ్.

ఇచ్చాడు మిత్రుడు. దానిమీద తాను రిజైన్ చేస్తున్నట్లు రాశాడు.

"రేపు ఆఫీసర్ గారికి ఇయ్య" అన్నాడు విక్రమరావు.

మిత్రుడు దాన్ని చదివి-

"నువ్వు చాలా ఆవేశంలో వున్నావు" అన్నాడు.

విక్రమరావు చిన్నగా నవ్వేడు ఆ నవ్వులో శాంతం వుంది.

"లేదు.. ఇది ఆలోచించి తీసుకున్న నిర్ణయమే. 'అనవసరంగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నానే' అని విచారించే రోజు రాదు" అన్నాడు విక్రమరావు.

"సరే...నీ యిష్టం...కానీ నేను చెప్పేది కూడా విను. ఎన్ని రోజులు అక్కడ వుండాలనుకుంటున్నావో అన్ని రోజులకే శలవు రాసి ఇయ్యి. ఆఫీసరు గారితో నేను మాట్లాడతాను. ఆయన చేత శలవు శాంక్షన్ చేయిస్తాను. నువ్వు తిరిగి వచ్చాక రిజిగ్నేషన్ ఇయ్యి." అన్నాడు మిత్రుడు.

ఆ సలహా నచ్చనట్లు చూశాడు విక్రమరావు.

"నీకోసం కాదు...ప్లీజ్ నాకోసం" అంటూ మరోక కాగితం తీసుకొచ్చి ఇచ్చాడు మిత్రుడు.

మిత్రుడి ముఖంలోకి చూసి కేవలం ఆ మిత్రుడి తృప్తికోసం అన్నట్లుగా పదిహేను రోజులకు శలవు రాసి ఇచ్చాడు.

"సరే...నువ్వు వెళ్ళిరా. మిగతా విషయాలు నేను చూసుకుంటాను." అన్నాడు మిత్రుడు.

టైము చూసుకున్నాడు విక్రమరావు. తొమ్మిది గంటలు దాటింది.

"వస్తాను. పదిగంటలకు బస్సు వుంది" అన్నాడు విక్రమరావు లేచి నిలబడి.

"పద...నిన్ను స్కూటర్ మీద డ్రాప్ చేస్తాను" అన్నాడు మిత్రుడు.

"ఎందుకు? దగ్గరేగా... వస్తాను" అంటూ చీకట్లో కలిసిపోయాడు విక్రమరావు.

మిత్రుడి ధోరణికి వింతగా ఆలోచిస్తూ వుండిపోయాడు ఆ మిత్రుడు. ఆఫీసరు గారిచేత శలవు శాంక్షన్ చేయించగల సత్తా అతనికి వుంది మరి.

పదిగంటలకు బయలుదేరిన బస్సులో విక్రమరావు కూర్చున్నాడు.

బస్సు బయలుదేరింది.

మరొకసారి గట్టిగా నిర్ణయించుకున్నాడు.

ఉద్యోగం మానేసి, బొమ్మలతయారీ చేపడతాడు. అదే అమ్మకు తృప్తి కలిగిస్తుంది.

అమ్మకు తృప్తి కలిగితే తనకు కలిగినట్లే.

ఎందుకో తెలియదుగానీ ఈ ఆలోచన వచ్చిన క్షణం నుంచీ గత మూడు సంవత్సరాలుగా తన మనసులో ఏర్పడ్డ వెలితి పూడుకుపోయింది.

బస్సు స్పీడు అందుకోగానే లైట్లు ఆర్పేశాడు డ్రైవరు.

సీటుకి జార్లపడి కళ్ళు మూసుకుని 'అమ్మ...అమ్మ' అని అస్పష్టంగా గొణుక్కున్నాడు విక్రమరావు. □